వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తం

- 45వ వార్డులో సక్రమంగా పనిచేయని విద్యుత్ లైట్లు
- కొండవాలు ప్రాంతాల్లో అంధకారం
- చీకట్లలో రాకపోకలకు స్థానికులు, వాహన చోదకుల ఇక్కట్లు
- దృష్టి సారించని విద్యుత్ అధికారులు


నరసింహనగర్ జంక్షన్ వద్ద రైతుబజార్ రోడ్డులో వెలగని హైమాస్ట్ లైట్లు


వరాహగిరి కాలనీలో 110/బీ/11/3 పోల్‌పై వెలగని వీధిలైటు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని పలు ప్రాంతాల్లో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వార్డులో అధిక శాతం ప్రజలు నివసించే కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయడం లేదు. సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ, సింహగిరి కాలనీ వంటి ప్రాంతాల్లో వీధిలైట్లు నిత్యం మొరాయిస్తున్నాయి. కొన్ని దీపాలు వెలిగినా.. ఉదయం సమయంలో ఆరడం లేదు. ఇటీవల వర్షాలు కురుస్తున్నప్పటి నుంచి కొన్ని లైట్లు వెలగడం మానేశాయి. దీంతో కొండవాలు కాలనీల్లో అంధకారం నెలకొంది. రాత్రి వేళల్లో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రంగు మారిన విద్యుత్ దీపాలు

వరాహగిరి కాలనీ-2లో కొన్ని చోట్ల వీధిలైట్లు(110 బీ/11/3 పోల్ నంబర్) ఏర్పాటు చేసి చాలా కాలం కావడంతో రాత్రి వేళల్లో సరైనా వెలుతురు లేక పసుపు రంగులోకి మారిపోయాయి. ఇలా రంగు మారిన లైట్ల వల్ల లైటింగ్ తగ్గిపోయి, వెలిగినా వెలగనట్లే ఉంటున్నాయి. కొన్ని చోట్ల వారాల తరబడి పగలంతా లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి. ఇలా వెలిగి వెలిగి కొన్ని వీధి దీపాలు ఆరిపోయాయి. రాత్రి వేళల్లో అసలు వెలగడం లేదు. ఇటువంటి లైట్ల గురించి విద్యుత్ సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదు.

వెలగని హైమాస్ట్ లైట్లు

వార్డులోని పలు ప్రధాన జంక్షన్లలో సైతం విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేయగా.. సచివాలయ సిబ్బంది వచ్చి తూతూ మంత్రంగా తనిఖీ చేసి సమస్య తమది కాదని, విద్యుత్ శాఖదని చెప్పి వెళ్లిపోతున్నారు. కైలాసపురం ఇనార్బిట్ మాల్ వెనుక రోడ్డులో స్ట్రీట్ లైట్లు, హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. ఈ రోడ్డులో ప్రతి రోజూ సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం కొండవాలు ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ వెలుగులు లేకపోవడంతో అంధకారంలో ప్రయాణించేందుకు భయాందోళనలు వ్యక్తం చేశారు. నరసింహనగర్ రైతుబజార్ రోడ్డులో హైమాస్ట్ లైట్లు వెలగక పోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. పోర్ట్ క్వార్టర్స్ రహదారిలో లైట్లు వెలగక అంధకారం నెలకొంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి వీధిలైట్లను సక్రమంగా నిర్వహించి అంధకారంలో తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


వరాహగిరి కాలనీ-2లో పగలంతా వెలుగుతున్న విద్యుత్ లైటు


అంధకారంలో పోర్ట్ క్వార్టర్స్ రహదారి

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు

కొండవాలు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, వరాహగిరి కాలనీ ప్రాంతాల్లో చాలా చోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఆరడం లేదు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. వీటిపై ఫిర్యాదులు చేసినా ఎవరూ స్పందించడం లేదు.

– వి.అప్పారావు, వరాహగిరి కాలనీ

రాత్రి వేళల్లో ఆందోళన

చీకటి పడ్డాక పనులు, చదువులు ముగించుకుని ఇళ్లకు చేరే ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు అంధకారం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వీధిలైట్లు లేకపోవడం, ఉన్నవి వెలగకపోవడంతో నిత్యం భయం భయంగా కొండవాలు ప్రాంతాల్లోని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఒకపక్క కుక్కలు, మరోపక్క విషసర్పాలతో ఏ ఆపద ముంచుకొస్తుందో తెలియక రాత్రి వేళల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– ఎస్.సత్యవేణి, సత్యసాయినగర్

వీధి దీపాలను సరిచేయాలి

వరాహగిరి కాలనీలో కొన్ని చోట్ల చీకట్లు అలుముకుంటుంటే, మరి కొన్ని చోట్ల పగలు, రాత్రి తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. వీటిని పట్టించుకునే నాథుడు లేరు. కొన్ని స్ట్రీట్ లైట్లు ఏకంగా దిశ మారి ఆకాశం వైపు తిరిగిపోయాయి. రోడ్డు మీద వెలుతురు పంచాల్సిన దీపాల దిశ మారడంతో రహదారుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. అధికారులు స్పందించి వీధిలైట్లను సరిచేయాలి.

– ఎస్.కృష్ణమూర్తి, సాలగ్రామపురం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో రూ.2.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటికి శనివారం సీతంపేటలో మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2.80 కోట్ల నిధులతో వార్డులోని మధురానగర్, శాంతిపురం, రాజేంద్రనగర్, హరిజన వీధి, రెల్లివీధి, సీతంపేట ఫిష్ మార్కెట్ ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు, బీటీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెట్లు వంటి పలు అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక, నార్త్ ఇన్‌చార్జి సురేష్‌బాబు, జీవీఎంసీ ఈఈ గంగాధర్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, డీఈ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఏఈ విస్సు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో ఆర్థరైటిస్ సమస్యల నివారణ

తాటిచెట్లపాలెం: శరీరంలో ఎన్నో కదలికల కల్లోలమే ఆర్థరైటిస్ అని సీతమ్మధార కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, ఆర్థోస్కోపి, జాయింట్ రీప్లేస్‌మెంట్ స్పెషల్ డాక్టర్ రామరాజు ముదునూరి పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని శనివారం ఆయన పలు విషయాలను తెలియజేశారు. సుమారు 100 పైగా జాయింట్లను ప్రభావితం చేసే వ్యాధులకు సంబంధించినదే ఆర్థరైటిస్ అని, ఇది రెండు రకాలన్నారు. దీనిని పూర్తిగా నివారించలేకపోయినా, జీవనశైలిలో కొన్ని మార్పులు, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పెద్ద సమస్యలను నివారించవచ్చని సూచించారు. సరైన ఆహారం, తక్కువ ఒత్తిడితో చేసే వ్యాయామం మేలు చేస్తాయన్నారు. బలమైన ఎముకలకు కాల్షియం, విటమిన్ డీ అవసరమని, వీటిని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న పోతు సత్యనారాయణ

సీతంపేట: జీర్ణాశయ క్యాన్సర్‌తో ఇటీవల మరణించిన 26వ వార్డు రామకృష్ణానగర్ రజక వీధికి చెందిన ఎల్దూటి సురేష్ కుటుంబాన్ని శనివారం స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5 వేల నగదు, రూ.5 వేల విలువైన నిత్యావసర సరకుల కూపన్ మృతుడి భార్య సావిత్రికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, రామదుర్గా రజక సేవా సంఘం ప్రతినిధులు చిన్నా, ఈశ్వరరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి భరోసా


బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ న్యూ శ్రీనివాస్‌నగర్‌లో నివసిస్తున్న పుచ్చ అప్పలరెడ్డి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంకల కవిత ఆదేశాల మేరకు శనివారం బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు యాదవ్ అప్పలరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అతడి ఆరోగ్య సమాచారం తెలుసుకుని, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని కార్పొరేటర్ కవిత భరోసా ఇచ్చారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దండి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: విశాఖ వేదికగా జరగనున్న భాగస్వామ్య సదస్సుకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, సంబంధించిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన 3, 5 జోన్ల పరిధిలోని నేషనల్ హైవే, తాటిచెట్లపాలెం, న్యూ కాలనీ రోడ్డు, తెలుగు తల్లి ఫ్లైఓవర్, సంపత్ వినాయక టెంపుల్ రోడ్డు, సిరిపురం జంక్షన్, పార్కు హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్ పాత్‌లు, అభివృద్ధి పరుస్తున్న కూడళ్లను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీడీహెచ్ ఎం. దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు గంగాధర్, శాంతిరాజ్, డీఈఈలు, ఏఈలు, వార్డు ఎమినిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐతో ఏయూ ఒప్పందం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరఫున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్యనారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు.

వైభవుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భారీ అన్నసమారాధనలు


ధర్మానగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈతలపాక సుజాత, నిర్వాహకులు


సంతోష్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కంచరపాలెం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం 46వ వార్డు తాటిచెట్లపాలెం పరిధి సంతోషనగర్‌లో ఎస్ఆర్‌జేవైపి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి దుర్గమ్మ మండపం వద్ద మహా అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఐస్ గడ్డలతో 9 అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేసి మహా దీపారాధన, సోమవారం దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివ, సురేంద్ర, గణేష్, నాగూర్, రవి, సూర్య, పండు, సారథి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

◆ 55వ వార్డు కంచరపాలెం ధర్మానగర్‌లో భారీ అన్నసమారాధన చేపట్టారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఈతలపాక సుజాత పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, గంట్యాడ వీరుబాబు, తోట నగేష్, ముంతా సుధా, డి.లీలావతి, ఉత్సవ కమిటీ సభ్యులు చుక్క సింహాచలం, జంజూరు గోవింద్, ఎల్ శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

కుప్పలు కుప్పలుగా చెట్ల కొమ్మలు

- రోడ్ల పక్కన పది రోజులుగా వదిలేసిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న 25వ వార్డు వాసులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో ఎక్కడ చూసినా చెట్ల కొమ్మలే దర్శనమిస్తున్నాయి. సీతంపేట, మధురానగర్, రాజేంద్రనగర్, శాంతిపురం ప్రాంతాల్లో పలు చోట్ల చెట్ల కొమ్మలు కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. చెట్ల ఆకులు రాలి, కుళ్లిపోయి కంపు కొడుతున్నాయి. దసరా పండగ రోజున వీచిన గాలివాన బీభత్సానికి చెట్లు, కొమ్మలు పెద్ద ఎత్తున విరిగి పడిన విషయం తెలిసిందే. రెండు రోజుల తర్వాత అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలను నరికి రోడ్డు పక్కన కుప్పలుగా వేశారు. పది రోజులు గడిచినా వాటిని తరలించకుండా అలా వదిలేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెట్ల ఆకులు కుళ్లి రోడ్డంతా విస్తరించి చుట్టుపక్కల నివాసులకు ఇబ్బందికరంగా మారాయి. రాజేంద్రనగర్‌లో వీటీ స్కూల్ గోడ పక్కన, అపూర్వ ఆస్పత్రి రోడ్డులో, ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద, మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ గోడ పక్కన, శాంతిపురంలో శ్రీకృష్ణ రెసిడెన్సీ వద్ద చెట్ల కొమ్మలు పడి ఉన్నాయి. బీవీకే కళాశాల ఎదురుగా బస్ షెల్టర్ వద్ద పడిపోయిన చెట్టు కొమ్మలు నరికి గెడ్డలో వదిలేశారు. కొమ్మలు తరలించడానికి పది రోజుల వ్యవధి సరిపోలేదా అని జనం మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తక్షణం తరలించాలని కోరుతున్నారు.


అపూర్వ ఆస్పత్రి రోడ్డులో కుళ్లిపోయిన చెట్ల ఆకులు


బీవీకే కళాశాల ఎదురుగా గెడ్డలో వదిలేసిన చెట్ల కొమ్మలు


శాంతిపురంలో శ్రీకృష్ణ రెసిడెన్సీ వద్ద చెట్ల కొమ్మలు, వ్యర్థాలు


ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద తరలించని కొమ్మలు


రాజేంద్రనగర్‌లో వీటీ స్కూల్ వద్ద వదిలేసిన చెట్ల కొమ్మలు

జర్నలిస్టుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

విశాఖ సిటీ: రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.


నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యులు

ఘనంగా ధార్మిక సంఘ వార్షికోత్సవం

- 600 మంది సిస్టర్లకు సత్కారం

కంచరపాలెం: సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ ధార్మిక సంఘం ప్రారంభమై 375 వసంతాలు పూర్తయిన సందర్భంగా శనివారం సాయంత్రం సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ అన్నేసి విశాఖ ప్రావిన్స్ వేడుకలు జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పూలా ఆంథోనీ, బిషప్ ఎమోరిటస్ రెవరెండ్ మల్లవరపు ప్రకాష్, ఫాదర్ సురేష్‌బాబు, సిస్టర్ రోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అణగారిన వారికి సేవ చేయాలనే తమ లక్ష్యంలో భాగంగా ప్రేమ, ఐక్యత, సేవ అనే స్థిరమైన సంకల్పంతో ముందుకు సాగిన ఆరుగురు ధైర్యవంతులైన మహిళలతో పాటు వ్యవస్థాపకుడు జాన్ పియర్ మెడైల్ (జెసీ)ను ఘనంగా స్మరించుకున్నారు. విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఉడుముల బాల, రెవరెండ్ ఎం.ప్రకాష్ డిడి, ఆర్చి బిషప్ ఎమోరిటస్ ఫాదర్ బవిరి సురేష్‌బాబు, రెవరెండ్ ఫాదర్ డి.బాలశౌరి, రెవరెండ్ ఫాదర్ జె.జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చి బిషప్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పూలా ఆంథోనీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో నాలుగు శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రేమ, సేవలు అందిస్తున్న సిస్టర్లకు అభినందనీయమన్నారు. సుమారు 600 మంది సిస్టర్లను సత్కరించారు.


సత్కారం పొందిన సిస్టర్లతో అతిథులు

తల్లి చెంతకు తప్పిపోయిన యువతి

తాటిచెట్లపాలెం: ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతిని ఫోర్త్‌టౌన్ పోలీసులు గుర్తించి తన తల్లి చెంతకు చేర్చారు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గత నెల 29న ఎం.హైమావతి అనే యువతి ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయింది. ఈ విషయమై యువతి తల్లి ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ వి.వి.రమణ నేతృత్వంలో పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేశారు. హైమావతి తన స్నేహితుల ద్వారా అశ్వారావుపేట చేరకున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి యువతిని గుర్తించి, శనివారం తల్లికి ఆమెను అప్పగించారు.


హైమావతిని తల్లికి అప్పగిస్తున్న ఫోర్త్ టౌన్ పోలీసులు

రైల్వేస్టేషన్‌లో 8.4 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 8.480 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో శనివారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన బురుగ ఆనంద్‌కుమార్, తెలంగాణ రంగారెడ్డి జిల్లాకు చెందిన సురకల హరికృష్ణ, కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన రోహిత్‌లు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ముంబైకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని రూ.42,400 విలువైన 8.480 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపులో అవాస్తవాలు

సీతంపేట: వుడా నుంచి 2004లో చినముషిడివాడలోని 164 గజాల స్థలాన్ని ఆక్షన్‌లో కొనుగోలు చేశానని డాక్టర్ చందక శ్రీకృష్ణ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021లో తన స్థలంలో భవన నిర్మాణాలు ప్రారంభించగా.. కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని, వీరి వెనుకున్న ఇందిర అనే మహిళ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. అడిగిన సొమ్ము ఇవ్వలేదని తన సొంత స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి అడ్డుతగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు ఆడపిల్లలున్నారని, వారి కోసం రూపాయి రూపాయి కూడబెట్టి కొన్న స్థలంలో నిర్మాణాలు చేపట్టాలంటే లక్షలు డిమాండ్ చేస్తున్నారని, లేదంటే వారు చెప్పిన ధరకు స్థలం వారికే విక్రయించాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా.. తనకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు ఉత్తర్వులతో తన స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులపై ఇందిర కొంతమందితో వచ్చి అడ్డుకుని దాడులకు దిగారన్నారు. తనకు ఇందిర నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి తన స్థలం తనకు అప్పగించాలని అధికారులను వేడుకున్నారు. వుడా నుంచి స్థలం కొన్న రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, కోర్టు ఉత్తర్వులు మీడియా ముందు ఉంచారు. అంబేడ్కర్ విగ్రహం తొలగింపులో వాస్తవాలను గ్రహించి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.


స్థలం రిజిస్టర్డ్ డాక్యుమెంట్ చూపిస్తున్న చందక శ్రీకృష్ణ

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మహారాణిపేట: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం బాలికలను ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ బాలురు, బాలికల నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. విశాఖ జిల్లాలో ప్రతి 1000 మంది బాలురకు 969 మంది బాలికలు ఉన్నారని, ఈ నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు ప్రకారం అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు అన్ని రంగాలలోను ముందున్నారని కొనియాడారు. ఐసీడీఎస్ పీడీ కె.వి.రామలక్ష్మి మాట్లాడుతూ సేవ్ గర్ల్ చైల్డ్‌ను ఉద్దేశించి లింగ వివక్ష ఉండరాదని, బాలికలు ధైర్యంగా ప్రతి విషయాన్ని ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వర రావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి ఎం.సత్యవతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ట్రైనీ నర్సులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.